కట్నాల కాంక్ష

రచయిత్రి

శ్రీమతి బులుసు ప్రకాశమ్మ దేవి

౧

ఉదయం ఎనిమిదిగంటల వేళ.

సీతమ్మగారు కాలవలో బిందె తో ముకుని నీళ్లుముంచుకుంటోంది. ఈ వేళ ఆమెను చూస్తే సాక్షాత్తు ఆ శ్రీమహాలక్ష్మిలాగే కన పడుతోంది. చూచినవాళ్ళందరు, అల్లాగే అనుకుంటున్నారుకూడాను. ఈ కాలపు నాగరికతలు ఆమెకుగిట్టవు. వంటినిండా వస్తువులు, కళ్ళనిండా కాటిక, నుదుట పావలాకాసంత తో పుకుంఖుంబొట్టు, లక్కరంగు బరంపురం పట్టుచీర ఆమెను ఓమాటుచూస్తే చాలు, మళ్ళీమళ్ళీ చూడాలని బుద్ధిపుడుతుంది. ఇంకా ఇద్దరుముగ్గురు పూళ్లో స్త్రీలు ఇప్పుడిప్పుడే చేతులో పసుపు, బిందెలో బట్టలు పెట్టుకుని మెల్లి మెల్లిగా చేరుతున్నారు. 'ఇదిగో సీతమ్మగారు! అప్పుడే నీళ్ళోసుకోవడమైపోయినట్టుందే. ఈ వేళ పొద్దున్నే పట్టుచీర కట్టుకున్నారు. ఏదేనా నోమాయేమిటి?' అంది ఒకావెం.

'లేదమ్మా! ఈ వేళా మాఅబ్బాయికి తాంబూలాలివ్వడానికి వచ్చారు. కాకినాడ సంబంధం; అనుకోకుండా కుదిరింది. అంచేత మీ కందరికి చెప్పడానికి వ్యవధిలేక పోయింది. అవునుగాని, ఇదిగో అనక చెప్ప లేదనుకో నేవు. మధ్యాహ్నం ఓమాటురావేం, నీ యత్తకి వాళ్ళకి కూడాచెప్పు. తొందరగా వెళ్లాలి. వచ్చినవారు అబ్బాయిమామగారి భావమరిదిగారేట. రెండో ఆయన వారిపురోహితుడు కామోసు. ఓమూల తలంట్లవాలి. అరిసెలొండాలి. ఏటొచ్చీ ఒఖ త్తిని. దబ్బున రావేం, అమ్మా!' అంది బిందెఎత్తుకుంటూను.

'ఓహో, ఇంకాచెప్పరేం, పిన్నిగారూ. కట్నాలేపాటి. వియ్యపురాలి కేమాత్రం.' అంటే 'దేవుడిదయవల్ల అన్ని బాగానే కుదిరాయి, అమ్మాయీ! అనక స్థిమితంగా చెపతాను' అంటూ బుజాన్ని బిందె పెట్టుకుని తొందరగా వెళ్ళిపోయింది.

౨

వెంకటశాస్త్రిది అమలాపురం కాపురస్థలం. అది తూర్పుగోదావరిజిల్లాలో ఒకముఖ్య గ్రామం. అమలాపురంఅంటే కోనసీమే కళ్లకు కట్టినట్టుంటుంది. కోనసీమవారందరిచేత అది పట్నంగానే వ్యవహరింపబడుతుంది. చాలామంది కోనసీమవారి పట్నపుఅనుభవాలు అమలాపురపువే. పెండ్లికి కావలసినబట్టలు, ఇంటికి కావలసినవస్తువులు ప్రతీదానికి అమలాపురమే వారిపెద్దదిక్కు. మునసబుకోర్టు, ఆసుపత్రి, హైస్కూలు, సినిమాహాలు- మొత్తానికి పట్నపులక్షణాలన్నీ దానికున్నాయి.

స్వచ్ఛమైన వెలనాటి వైదికకుటుంబాలు ఇక్కడచాలావున్నాయి. బ్రాహ్మణీకం ఇక్కడఇంకా సజీవంగాఉందనిచెప్పవచ్చు. హాయి

గా పంటలు పండుతూవుంటే యేచీకుచింతా లేకుండా కాలిమీద కాలువేసుకుని రోజులు వెళ్లబుచ్చేవారు ఇక్కడ చాలామంది వున్నారు.

ఆలాంటిసంపన్నగృహస్థులలో వెంకటశాస్త్రిఒక్కడు. అతనిభార్య సీతమ్మ. చాలాదొడ్డయిల్లాలు. అమాయికురాలనికూడా చెప్పవచ్చు. భర్త యేదిచెబితే అది అవునేమో అనుకుంటుంది. సంతానం ఆరుగురిలోను మొదటి అయిదుగురు వరుసగా ఆడపిల్లలే. ఆరవవాడు రామారావు. ఆడపిల్లలతో విసిగి సమస్తనోములునోచి ఆఖరికి సుందరకాండ పారాయణచేయగానే పుట్టడంచేత రామారావనిపేరుపెట్టుకున్నారు. 'కన్యాదానఫలం' అంటే మొదట వెంకటశాస్త్రిగారినే చెప్పాలి. చిన్నంబంగారమేనా పెట్టమనకుండా ఈడూజోడూచూసి కాళ్లుకడిగి కన్యాదానాలుచేసే డాయన. అల్లుళ్లంతా మంచిస్థితిలోవున్నారు. ముదిముప్పునపుట్టిన ఒక్కమొగబిడ్డని ఎంతెంతవాణ్ణో చెయ్యాలని వెంకటశాస్త్రిఆశ.

'చాపచిరిగినా చదరంత' అన్నట్టు ఆడపిల్లలపెళ్లిళ్లమూలాన్ని పోయినంతపోగా ఇంకా నాలుగైదువందలువచ్చేఆస్తి శాస్త్రిగారికి వుంది. ఆడపిల్లలసమ్మంధములు కుదిర్చిన అనుభవాన్నిబట్టి కొడుకుపెళ్లివిషయమై చాలా మధురమైనతలంపులు తలుచుకుంటూఉండేవాడు వెంకటశాస్త్రి. మూడవపిల్లపెళ్లి కుదిర్చేటప్పుడు సెంటుభూమేనాలేని భలానివారి అబ్బాయికి 'పదిహేనువందలు ఇచ్చేటట్లయితే ఏమోఆలోచిస్తాము' అన్నారు వారు.

'ఆలాంటప్పుడు నాకు ఎలాచూసినా నాలుగువందలురావడానికి చావులేదు. ఒక్కమూడేళ్లు కళ్లుమూసుకుంటే మనవాడూ యెఫ్.యే లోకివస్తాడు.' ఈతలంపులతో ఊహాకందినపెద్దపెద్దవారి పిల్లలందరిమీదికీ అతని ఆలోచన పోయేది. 'మొన్న భలానివారు మీఅబ్బాయి ఏమిచదువుతున్నాడని అడిగారు, బహుశా వారి అమ్మాయినిఇద్దామన్న ఆలోచనతోటే అయివుంటుంది. వారు ఇదివరకు అల్లుళ్లందరికీ పెద్దకట్నాలే ఇచ్చారు. కాని వాళ్ల పిల్లలు వట్టినలుపు, ఇవే అతనిఆలోచనలు.

3

మధ్యాహ్నం మూడుగంటలవుతుంది. వెంకటశాస్త్రిగారిసావిడి కలకల్లాడుతూంది. గ్రామములో పెద్దమనుష్యులు ఒక్కొక్కరేవచ్చి కూచుంటున్నారు. కొందరు తెల్లటి కండువాలు మడతవిప్పకుండానే చేతిమీద వేసుకున్నారు. ఓభుజాన్నిశాలువా ఓభుజాన్ని అంగవస్త్రంతో పొడుంకాయలు సవరించుకుంటూ కొందరు. మధ్యని ఓచాపమీద పన్నీరుబుడ్డీ గంధపుగిన్నీ తమలపాకులు అరటిపళ్లు పెట్టారు. 'భావగారూ! వర్షం ఇంకావుందంటారా' అంటే 'ఇక ఉపక్రమిత్తామా' అంటూ ఓహరితో ఒహరు సంప్రతిస్తున్నారు. వెంకటశాస్త్రిగారి ముఖంలో ఈవేళ లాస్యం తాండవమాడిపోతోంది. సీతమ్మగారు చాలాసందడిగా అటూఇటూతిరుగుతూ ఎవరికేంకావాలో అడగడమేతడువుగా అందించుతోంది. మధ్యమధ్యవచ్చినవారితో 'ఏదో మీఅందరి ఆశీర్వచనంవల్ల మాప్రాణాలురెండూ బావుండగా శాస్త్రనలుసు ఇంట్లో బయలుదేరితే నూకంతేచాలు, వియ్యపురాలిపుట్టింటివారు చాలాఆహితాగ్నులూ, సాంప్రదాయం మంచిదీట' అంటూ కాబోయేకోడల్ని, వియ్యాలవార్ని తలుచుకుని పొంగిపోతోంది.

'శాస్త్రులుగారూ! అబ్బాయిగారిని ఈలా ఈపీటమీదికి రమ్మనమనండీ' అన్నాడు ఓఅవధాన్లు. రామారావుకి ని

జానికి పదిహేనోఏడు. సీతమ్మగారిని అడిగితేమాత్రం 'పదిహేను మొన్ననే కాదండీ వెళ్లేయి' అంటుంది. మీసకట్టు ఆట్టేకనపడ్డంలేదు. పచ్చగా గుమ్మిడిపండులా వుంటాడు. ముఖంలో అతిగారాబపు లక్షణాలు తొణుకుతూవుంటాయి. ప్రస్తుతంఫోర్తుఫారం చదువుతూవున్నాడు. పెళ్లంటేఅతడికి చాలాసరదా. పట్టంచుపంచెలు చాలావస్తాయని, ఏదికావలిస్తే అదిమామగారిని దర్జాగా అడగొచ్చునని, మామగారనే పోకమనిషిమీద ఇష్టంవచ్చినంత అధికారం చలాయించవచ్చునని ఈలాంటివే అతని ఆలోచనలు.

వాళ్లమ్మ 'పిల్ల పచ్చగా దబ్బపండులావుంటుందట' అని అందరితోచెబుతూవుండడం చేత ఓమాటు ఆపిల్లనిచూస్తే బాగుండునని కూడావుంది. 'జీలకర్ర బెల్లంపెట్టి తెరతీసేటప్పుడేగాని యీలోపున వధూవరులు చూసుకోడం శాస్త్రసమ్మతంకా'దన్నాడు వెంకశాస్త్రి. పెళ్లికొడుకుకుతగినఠీవితో రామారావు పీటమీదికి వచ్చి కూర్చున్నాడు. అవధాన్లవారు ఒకటి రెండుపనసలు చదివేరు. సీతమ్మగారు తలుపువారనిల్చొని పళ్లెంతాకళ్లతో ఈవైభవంచూస్తోంది. ఇంతలో ఆడపెళ్లివారివేపు వచ్చినపెద్దమనిషి లేచి మెళ్లోకండువా సర్దుకొని కొత్తపంచలచాపు అదివరకేవుత్తరించివుంచినది రామారావుమెళ్లోవేసి తాంబూలం చేతికి యివ్వబోతూంటే 'ఆగండి' అన్నాడు వెంకటశాస్త్రి. ఏమన్నఅర్థంగా తెలతెప్పిచూచేడు ఆయన. 'వారికీ మనకీ జరిగినమాటలేవో యేపద్ధతిని తథాస్తు అనుకుంటున్నామో అవన్నీ ఓమాటుఅని తాంబూలంయివ్వడంయుక్తం. స్థిమితంగాలాంఛనప్రకారమే నడుస్తాం. తొందరేముంది' అనిపక్కాయనవేపుతిరిగిఅన్నాడు వెంకటశాస్త్రి.

'అంతకన్నానా! నేనూ ఇదిగో మనవిచెయ్యబోతూన్నా. రెండువేల రూపాయిలకట్నము, అయిదువందలు లాంఛనములు, ఇవ్వమని అభిప్రాయంకనబరచేరు, అన్నగారు. ఎలాచూసినా బాలతొడుగుగాక పిల్లవంటిని పదిహేనువందలకు దగ్గరగా పెద్దవస్తువులున్నాయి. అందుచేత వెయ్యిన్నూటపదహార్లు కట్నము లాంఛనాలు యిచ్చేటట్లుగా నిర్ణయపరచారు మాబావగారు. ఆలా జరిగించేటందుకు ఏమీ అభ్యంతరంలేదు.' అన్నాడు ఆపెద్దమనిషి. వెంకటశాస్త్రి ఇహ అక్కడలేడు. ఎటువెళ్లేడో? వచ్చిన గ్రామస్తులు మొహామొహాలు చూసుకుంటున్నారు. వారిలోంచి పెద్దలు యిద్దరుముగ్గురు లేచి ఆడపిల్ల వేపువారితోసహా పెరట్లోకెళ్లారు. రామారావు కూచోవాలో లేచివెళ్ళిపోవాలో తెలియక అందరిమొహాలూచూస్తూ వున్నాడు. మొగుడుతెచ్చిన పేచీకి సీతమ్మగారి వొంటిమీద జెర్రిలు పాకడం మొదలెట్టాయి.

'అన్నగారూ ! తమరలాదయచెయ్యాలి' అంటూ తనవద్దకివచ్చినవారితో 'ఏమిరావడమండీ, శుభమస్తులోనే ఇంత పేచీకి సిద్ధపడ్డ మనుష్యులతో బాంధవ్యమేమిటండీ. వారిపిల్లకి వారు పదిహేనువందలు పెట్టుకోనీ ఏమిటేటిటగానీ అనుకున్నప్రకారం నడవక్కరలేదూ. ఇక మీరు లక్ష చెప్పండి. నామనస్సు తిరగదు. తమరు దయచేయవచ్చు' అన్నాడు వెంకటశాస్త్రి. 'మనవిజేస్తున్నా. పోనీ తమ సెలవుప్రకారమే' అంటూ ఇంకా ఏదో చెప్పబోతూన్న పెద్దమనిషిమాట చెవినిబెట్టకుండా 'ఇప్పుడేమన్నా ఇహవినను' అంటూ అక్కడవుంటేనే జవాబు చెప్పవలసివస్తుందని ఇంట్లోంచికూడా వెళ్ళిపోయేడు.

సీతమ్మగారికి ఇహ ఉండబట్టలేదు. ఆమె కూడా పెరట్లోకివచ్చి అక్కడివారితో 'అన్నగారూ! శాంతించండి. నామాటకాస్తవినండి, మొదటినుంచీ ఆయనది ఇదేతీరు, నేబతికుండగా ఆయన పిల్లాడిపెళ్ళి జరగనియ్యరు, నాముచ్చట తీరనియ్యరు, ఈకోపధారిమనిషితో యిదేమచ్చుని ముప్పైఏళ్లై వేగుకొస్తున్నాను. వెధవడబ్బు, ఓరెండొందలు ఎక్కైతే నేమిటి. మీరుకూడా తొందరబడకండి' అంది. 'ఏమిటండీ! అక్కగారూ! పిల్లవంటిని పెద్ద వస్తువులున్నాయి, మీరేనా పెట్టేవే గనక అవే మీవనుకుందాం. అని అనుకున్నాంగాని ఇష్టంలేకపోతే పోనీ డబ్బేకుమ్మరిద్దుం. ఇంతకీ యీ అభిప్రాయం మేము మొదటే తెలియబరచేంకూడాను. లేకపోతే మే మీవేళ యీలా వస్తామా. పోనీ ఏలాగైనాసరే. కార్యసానుకూలం మనకావలసింది. అంటే ఆయన యింట్లోనే లేరాయెను. మేము మళ్ళీ వస్తాములెండి. పాపము మీరు బహు అమాయకులు' అంటూ వెళ్ళిపోయేరు.

౪

రామారావు స్కూలుఫైనలు ప్యాసయినాడు. వెంకటశాస్త్రి రాజమండ్రీకి కాపురం మార్చి కొడుకుని యింటరులో ప్రవేశపెట్టేడు. రామారావుకూడా మునపటికంటే పెద్దవాడవడంచేతనూ, కోనసీమగాలి బాగా పట్టడంచేతనూ తండ్రిమాటలలో వుండే సబబు అతనికి బాగా నచ్చింది. తనకేం వక్కడు. పంచుకునేవాళ్లెవరూలేరు—పైగా చదువు—తొందరేంవచ్చింది—ఆ బి. యే. కాస్తా అయిందనిపిస్తే సరి. హైకోర్టు జడ్జీలు కూతుళ్ళని కాళ్ళమీద పడవేస్తారు. ఏమీ ఆధారం లేని శర్మగాడు చదువుపూర్తి అయేదాకా ఊరుకునేసరికి డిప్టీకలెక్టరు పిలిచి పిల్లని చ్చాడు. పైగా తనది మంచిఆస్తి' అనుకుంటూ చదువుకుందామని యీజీఛెయిర్లో కూర్చుంటాడేగాని కళ్లు పంక్తులవేపు చూస్తూ వుండగానే ఆలోచనలు అసేతుహిమాచలం తిరిగివస్తాయి.

'వెంకటశాస్త్రిగారు తమరేనాండీ' అంటూ మూడుగంటలవేళ ఎక్కడకోబయలుదేరబోతూవున్న శాస్త్రిగారిని ఓపెద్దమనిషి లోపలికివస్తూ పలకరించేడు. మంచిముఖవర్చస్సు, ఆజానబాహువులు, పెద్దనుదురు ఆయన్ని బహుఉత్తముడని, ఘరానాకుటుంబములోవాడనిన్ని చెప్పక చెబుతున్నాయి. ఉభయులు గదిలో చాపమీదకూర్చున్నారు. రామారావుకుర్చీలోనే చూస్తూకూర్చున్నాడు. 'అయ్యా! తమనామధేయం. వచ్చినపని' అన్న వెంకటశాస్త్రితో 'నాపేరాండి. సూర్యనారాయణసోమయాజులంటారు. రామచంద్రపురం కాపురస్థలం. మాపెద్దలు తాతగారూ తండ్రిగారూ యజ్ఞాదిక్రతువులు చాలాచేశారు. తాతగారిపేరేనాది. తమదర్శనం చేదామని వచ్చాను. ఇహవారూ వీరూఎందుకు నేనే మనవిచేద్దామనితలంపు. అబ్బాయిగారు చదువుకుంటున్నారని, అక్కగారు బహుయోగ్యులని విన్నాను. అమ్మాయిని తమకడుపులోవేద్దామనితలంపు. మిగతావన్నీ తమయిష్టప్రకారం జరపడానికి అభ్యంతరంలేదు' అన్నాడు ఆయన. ఈసంభాషణశాస్త్రికి చాలావిసుగ్గావుంది. 'ఛా! ఆఖరికి యీచాదస్తపుబ్రాహ్మడితో నావియ్యం' అనుకున్నాడు. 'చదువుపూర్తి అవందే...అనియింకాఏదోఅనబోయేశాస్త్రి మాటకి అడంవచ్చి 'తమచిత్తం మా అమ్మాయికేనా పదోఏడు. పెండ్లిమాత్రం జరిగిస్తే చదువుపూర్తిఅయ్యాకే తీస[illegible]వెళ్లవచ్చును. నాకెటుచూసినా యీపిల్లవక్కర్తేనూ. నే

నయి చెప్పకోకూడదుగాని మాపిల్లనిఅందరూ చాలాఅందమైన పిల్లఅని అంటారు. నాకున్న దేదో అమ్మాయిదే. ప్రస్తుతం వెయ్యిరూపాయలుకట్నము. లాంఛనాలుయివ్వగలను. తమకు ఇహాతప్పదు.' అనే పెద్దమనుషిమాట పూర్తిగా వినకుండానే 'మళ్లీ కలుసుకుందాం లెండి' అంటూ లేచి వెళ్లిపోయేడు వెంకటశాస్త్రి.

'ఏమండీ యిందాకమాట్లాడినాయన రేపువస్తారోమో. ఏంచెప్పదలచేరు' అంది సీతమ్మగారు రాత్రిభోజనాలవేళ అన్నంవడ్డిస్తూను. 'ఏమిటా. నీమొహం. నీపనేదో నువ్వేడుద్దూ. అన్నింటికీ రాక. తనకూతురు చక్కనిదై తేమాత్రం ఏంవొలికింది' అన్నాడు శాస్త్రి. 'మీకడుపులో ఏముందో, మీఆలోచనలేమిటో నాకేంబోధపడ్డంలేదు. ఇప్పటికే రామానికి పెళ్లీడుతప్పింది. అనుకుంటే కంట్రకంకాని యిరవై రెండోయేడు కూడ వచ్చింది. ఇందాకా అబ్రాహ్మణ్ణిచూస్తే జాలేసింది. పాపం. ఎంతఇదిగామాట్లాడేడో చూసేరా. మన అమ్మాయిలపెళ్లిళ్లకి ఎన్ని తిప్పలుపడ్డాం. ఇంతకీ వారిచ్చేది మనకేం ఉండిపోతుందాఏమిటి. పిల్ల బాగుంటుందట. పోనివ్వకండి.' అంది ఆవిడ. 'పాపం! అబ్బబ్బా! యీదిక్కుమాలిన ఆడపెత్తనాలమాలాన్ని చచ్చేరోగంవచ్చిందిగదా. ఇహనుంచి నిన్ను సలహాఅడిగే చేస్తూవుంటానులే పన్లన్నీ. అడగక్కరలేదు శోభ. ఈ ఆడపీనుగులు వంటింట్లో చచ్చినట్టుపడిఉండక మహాతెలిసిన వాళ్లలా ఏముటో చెప్పొస్తూవుంటారు. అసలాడాళ్లు ఎందుకుపుట్టేరో తెలుసా?పనిచేయడానికే. నోరుమూసుకుని నీపనేదో నువ్వేడు. ఆఖరికి ఈ శతంజీవిగాడితోనా వియ్యం. అంటూ ఓ లెక్చెరు కొట్టేడు. 'నాకెందుకూ. మీయిష్టం వచ్చినట్లు చేసుకోండి' అనీ కళ్లకొంకితో అద్దుకుంటూ ఊరుకుంది ఆయిల్లాలు.

పిల్లచాలాబాగుంటుందిఅని విన్నప్పటినుంచీ రామారావుకి మనసులోఅదోలాఉంది. యిరవై రెండేడ్లంవాడుమరి. ప్రజ్ఞలెన్ని చెప్పినా పెళ్లాంమీదికి బుద్ధిపోతూంది. 'ఎన్నిసంబంధాలొచ్చినా ఏవోవంకలుపెడుతూనే వున్నావు. అసలు నీకుపెళ్లి చెయ్యాలనిలేదా ఏమిటినాన్నా?' అని సిగ్గువిడిచి అడిగేశాడు. 'ఊంహూం. ఇదా కథ. పిట్టకూతొట్టిందీ! తల్లీకొడుకూ కూడబలుక్కున్నారా యేమిటి? మీయిష్టంవచ్చినట్టు అఘోరించండి. నాకేం' అంటూ ఉత్తరాపోశనం పట్టిలేచిపోయేడు శాస్త్రి.

౫

రామచంద్రపురంకాలవలో ఓరాధారీపడవ మెల్లిగా వెళుతోంది. వారంతాపెళ్లివారు- ఇంకెవరూకాదు మన వెంకటశాస్త్రిగారే. పడవ పడిచెక్కపూటుగావుంది. హాలులోపెళ్లివారుగాక పైవాళ్లుకూడా కొందరు. సామాన్యంగాపదిమంది ఓచోటపోగయినారంటే సరి లోకంలో విశేషాలెన్నో వినవచ్చు.

కాకినాడలో ఎవరో పెన్షన్ డిప్టీకలెక్టరుగారికి ఒకత్తే కూతురుట. ఆయనమూడో పెళ్లిపెళ్లాము పిల్లట ఆపిల్ల. లక్షరూపాయలికి మించిన ఆస్తిట వారిది. ఆస్తేంలేకపోయినా సరేట మంచిరూపురేఖలున్నవాడై చదువుకుంటున్నపిల్లవాడుదొరికితే ఆపిల్లనివ్వడానికి వెతుకుతున్నారుటవారు.

ఈమాటలు హాలులో వారందరికి వినబడ్డాయి. ఒక్కమాటుఅందరూ అటుతిరిగి ఆ చెప్పేమనిషివేపు ఏదోప్రశ్నించేవారిలాచూసి మళ్లీతమమాటల్లోపడ్డారు. వెంకటశాస్త్రిగారి మొహంమాత్రం ఊసరవెల్లో దానితా

తో అయిపోతోంది. 'సరే అప్పుంచినరు కొట్టాం' అన్నమాటలు ఓక్షణమయినాక ఆయన నోటినుంచి అప్రయత్నంగా బయటికి వచ్చాయి.

రాత్రి తొమ్మిదిగంటలైంది. సూర్యనారాయణసోమయాజులుగారి ఇంటిముందరపందిట్లో పెండ్లివాద్యాలు దివ్యంగా మోగిపోతున్నాయి. 'పెండ్లికూతుర్ని చప్పునతీసుకు రండి' అని ఒకరు, 'గౌరీపూజగంప యేగదిలో వుందో కనపడదు' అని ఒకరు. అంతా తలో మాటాఅనేవారేకాని ఒహరుచెప్పేది ఒహరు వినడంలేదు. కన్యాదాత నోట్లుగాకుండా వెండిరూపాయలు లెఖ్ఖపెట్టి పళ్లెంనిండపోస్తున్నాడు.

'అబ్బాయిగారూ, కాళ్లిల్లా ఈపళ్లెంలో వుంచండి! సోమయాజులుగారూ! వరకట్నం పళ్లెంయిలా తెప్పిస్తారా! చదవమని శెలవా!' అన్నాడు పురోహితుడు.

సోమయాజులుగారి భావమరదు లిద్దరు రూపాయలపళ్లెం సాయంపట్టి తెచ్చి మధ్యని ఉంచారు. పౌరోహిత్యుడు గొంతుగు సవరించుకొని సభ కభిముఖుడై ...అని ప్రారంభించేసరికి, శాస్త్రిల్లుగారు 'ఉండవయ్యా, ఊః ఒకటేతొందర. ఈపళ్లెంలో దస్తావేజుకాగితం కనపడదేం' అన్నాడు అతిధీమాగా.

'కాగితాలేమిటండి!' అన్నాడుసోమయాజులు నివ్వెరపోతూ.

'కాగితాలేమిటా! ఒహత్తే పిల్ల నాకు, నాకున్నదంతాపిల్లకే. అని మొదట్లోనువ్వనలేదూ! ఎరగనట్లుమాట్లాడతావేం.' అన్నాడు శాస్త్రిలు.

'భావగారూ! శుభసమయాన్ని మీరీవిధంగా విఘ్నంకల్పిస్తే నేనేమనగలను? నాకున్నదేదో పిల్లకే యిస్తానన్నానుగాని ఇప్పుడే రాస్తానన్నానా! ఇవి కాళ్లుగాని చేతులుగావు. నామనవి విని కార్యంజరగనివ్వండి' అన్నాడు సోమయాజులు శాస్త్రిల్ని చేతులట్టుగు బతిమాలుతూ.

'యింకా కూచుంటావేమిరా!' అని కొడుకునుగద్దింపు గద్దించి ఎవరిమాటా చెవినిపెట్టకుండా విడిదికివెళ్లిపోయాడుశాస్త్రుల్లు. వెనకవెళ్లినపెద్దమనుష్యులు 'ఎవరిమాటా వినిపించుకోందే యేంచెప్పం'అని ముఖాల్నింతచేసుకుని వచ్చేశారు.

రెండునిముషాలయాక అచేతనుడై ఆలాగేనిలబడ్డ సోమయాజులు సభవారితో ఈవిధంగాఅన్నాడు! 'అయ్యా! తెల్లవారితే యేప్రేల్ ఒకటోతేదీ. శారదాబిల్లువచ్చి గొంతుగుమీదకూచుంటుంది. కాల తంత్రులంతా చాలాకర్మిష్టులు. నాకైనా ఒకత్తేపిల్ల. కొత్తపధంతొక్కి పెద్దలపేరుకి అప్రతిష్ఠతేవడం నాసమ్మతిగాదు. ఎల్లాగైనాఈలగ్గాన్నే వివాహంఅయి తీరాలి. ఈపిల్లని పెండ్లాడేందుకు యిష్టమున్న పుణ్యాత్ముడెవరేనాఉంటే ముందుకిరండి! ఈడుజోడు కుదిరితే చాలు. ఇక నేం వద్దు. రండి' అని ఆవేశంతోఅన్నాడు.

ఒక్కగడియ అంతా నిశ్శబ్దం.

ఇంతలో సుముహూర్తం చూడడానికి వచ్చినస్త్రీలలోంచి 'నాయనా! కృష్ణా.' అని వినబడింది.

'యేం అమ్మా,చెల్లెలు నిద్దరపోయిందా! ఇంటికి తీసుకువెళ్లనా' అంటూ ఓపిల్లవాడు సభలోకూర్చున్న మగవాళ్లల్లోంచిలేచి అటు వెళ్లాడు.

'చూస్తావేం'అంది అమ[illegible]దేవి.

ఆమాతాసుతు లిరువురికి కళ్లతోటి యేదో

సంభాషణజరిగింది.

'అయ్యా! నేను ఆకెళ్లవారి అబ్బాయిని. కృష్ణారావుని. రుక్మిణిని పెండ్లాడ డానికి నాకేం అభ్యంతరంలేదు' అన్నాడు అమాత్యవిధేయుడు, సోమయాజులుతో.

'నీవుటోయ్ ఎంత పెద్ద వాడవయ్యావు. పట్నంనుంచెప్పుడువచ్చావు. ఏమిటో పెద్ద పెద్ద చదువులు చదువుతున్నావుట,' అన్నా డా వృద్ధుడు.

ఇంతసేపటినుంచీ నిర్ఘాంతపోయి చూస్తూన్న రుక్మిణిమొహంమీదికి కల్యాణపుకళ గబుక్కున వచ్చిపడింది. ఆమె యెంతో సిగ్గుతో కృష్ణుడివేపు వారచూపులు చూస్తూ తలొంచుకుంది. పెండ్లి అయిదురోజులు చాలా వైభవంగా జరిగింది.

౬

యేదో నేర్చుకోడానికని పొరుగింటికెళ్ళిన రుక్మిణి అంతలోకే 'నాన్నగారూ విన్నారా?' అంటూ పరుగెత్తుకువచ్చింది. 'యేమిటమ్మా! కృష్ణమూర్తి యేవేనా బంతాటల్లో గిన్నెలు గెలిచాడా యేమిటి?' అన్నాడు సోమయాజులు కుమార్తెతో, నవ్వుతూ.

'అబ్బా యేమిటినాన్నా ఎప్పుడూ నీకిదే పని. అదికాదు. ఆవేళ మనింటికి పెళ్ళంటూ వచ్చాడే, ఆశాస్త్రులు ఎందుకలాగ చేశాడనుకున్నావు, మనవెంకమ్మత్తగారి జానకి చెప్పింది, ఆవిడత్తారు కాకినాడే కాదుమరీ. మనింటికి పెళ్ళికొస్తుంటే పడవలో ఎవరో చెప్పుకుంటూంటే విన్నాడట ఆ శాస్త్రుల్లు. కాకినాడలో ఓకలక్టరుగారు కూతురికి సమ్బంధాలు వెతుకుతున్నాడనీని, ఎంతో ఆస్తి యివ్వదలిచాడనీని. దాంతో ఈబ్రాహ్మడికి మతిపోయిందట. మనింటినుంచి ఇంటికి కూడా వెళ్ళకుండానే సరాసరి అవ్వూరే వెళ్లాడుట. మనింట్లో ఆయన జరిపిన కథంతా ఆయనకన్న ముందే వెళ్ళిందట అవ్వూరు. ఆ కలెక్టరు ఈ బ్రాహ్మడితో అసలు మాట్లాడనేలేదుట. పాపం బ్రాహ్మడెంతాశపడ్డాడో. మంచిపనిజరిగింది.' అంది రుక్మిణి.

'అదాసంగతీ! పోనీలే! ఆశాస్త్రులు పెళ్లాంపాపం ఎంతమంచి దనుకున్నావు' అంటూ యేదో చెప్పబోతూన్న సోమయాజులు మాటకి అడ్డంవచ్చి 'మనసమ్బంధం చెడిపోయాక ఆవిడసలు మంచంమీంచి లేవడమే లేదుట. నాకు కోడలు ముచ్చటలేదో తీరే యోగమేవుంటే పీటలమీది పెళ్ళి ఆవిధంగా చెడేపోదు; అంటుందిట. జానకి ఎంతో యిదిగా చెప్పింది' అంది రుక్మిణి.

'పోనీలేఅమ్మా! దేము డేదిచేసినా మన మేలుకే అంటూ తాతయ్య అంటూండేవాడు, జ్ఞాపకంవుందా' అన్నాడు సోమయాజులు.

ఆంధ్రజ్యోతి

మోల్మేన్—వారపత్రిక

సాలుచందా రు 3. విడిపత్రిక 9 పైసలు.

బర్మాలోని 1,60,000 ఆంధ్రుల క్షేమానికి పాటుబడుచున్న వారపత్రిక. ఇందు కార్మిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య విషయములు నిష్పాక్షికముగ చర్చించబడును. దీనికి బర్మా అంతటను ప్రచారము గలదు. వర్తకులందు తమసరకుల ప్రకటించిన మంచి లాభమును పొందగలరు. వివరములకు :

ఎడిటర్, "ఆంధ్రజ్యోతి"
185, లోవర్ మెయిన్ రోడ్డు,
మోల్మేన్-అని వ్రాయుడు.